

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 4 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ రేట్లు పెంచుకోవడానికి సమ్మె చేస్తుండటంతో మంగళవారం పత్తి మార్కెట్‌ను బంద్ చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శంషీర్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు కొనుగోలు చేసే విషయం చెప్పేంత వరకు మార్కెట్‌కు పత్తి తీసుకురావద్దని రైతులకు ఆయన సూచించారు.

కారులో ఉద్యమ సెగ!



వరంగల్ సీటు కోసం గులాబీలో టఫ్ ఫైట్

- తనకే మళ్లీ చాన్స్ ఇవ్వాలంటున్న సిట్టింగ్ ఎంపీ
- తమకే ఇవ్వాలని ఉద్యమకారుల డిమాండ్
- కుమార్తె కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రయత్నాలు
- టికెట్ రాదనే కారు దిగుతున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి

వరంగల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'గులాబీ' పార్టీలో టికెట్ల పంచాయతీ మొదలైంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వరంగల్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నవారి నుంచి అధినాయకత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఓ వైపు సిట్టింగ్ ఎంపీకి ఈ సారి అవకాశం లేనట్టేనని భావిస్తున్న ఆశావహులు తమకు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మరోవైపు మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తెను ఎన్నికల బరిలో దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది గమనించే వరంగల్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తన దారి తాను చూసుకుని బీజేపీలో చేరుతున్నారన్న చర్చ జరుగుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే.. తమకూ ఒక చాన్స్ ఇవ్వాలంటూ తెలంగాణ ఉద్యమకారులు కొత్త డిమాండ్‌ను తెరపైకి తేవడం బీఆర్‌ఎస్‌కు కొత్త చిక్కులు పెట్టింది. ఇప్పటికే చేజారిపోతున్న లీడర్లు, క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నా అవి ఫలించకపోవడం అధిష్ఠానానికి తలనొప్పిగా మారగా.. కొత్తగా ఉద్యమ సెగ బయటకు రావడంతో వరంగల్ ఎంపీ టికెట్ ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. ఇక పార్టీ మారుతున్నారన్న విస్తృతంగా ప్రచారం జరిగిన మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే అనుహ్యంగా మహబూబాబాద్ టికెట్ కేటాయిస్తున్నట్లుగా ప్రకటన చేయటం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

పదేళ్లుగా బీఆర్‌ఎస్‌కు కంచుకోటలు..

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ (ఎస్సీ రిజర్వుడు), మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వుడు) స్థానాలు ఏర్పడ్డాయి. తొలిసారిగా 2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్ విజయం సాధించారు. అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో బలరాంనాయక్ కేంద్ర మంత్రిగా కూడా పని చేశారు. ఆ తరువాత 2014 జరిగిన ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కడియం శ్రీహరి, మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసిన ప్రొఫెసర్ సీతారాంనాయక్‌లు విజయం సాధించారు. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి పసునూరి దయాకర్ విజయం సాధించారు. 2019లో మహబూబాబాద్ నుంచి ఎంపీగా మాలోతు కవిత విజయం సాధించారు. ఈ నేపథ్యంలో పదేళ్లుగా బీఆర్‌ఎస్‌కు వరంగల్, మహబూబాబాద్ స్థానాలు కంచు కోటలుగా ఉన్నాయి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమితో కేడర్‌లో జోష్ తగ్గింది. అంతేకాకుండా కీలక నేతలు పార్టీని వీడటం, కొందరు పార్టీతో అంటీముట్టనట్టుగా ఉంటుండటం కొంత ఇబ్బందికరమే అయినా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న బీఆర్‌ఎస్ అధినాయకత్వం తమకు కంచుకోటగా ఉన్న ఈ రెండు స్థానాల్లో ఎలాగైనా సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది.

వరంగల్ బరిలో కడియం కావ్య?


కడియం కావ్య

వరంగల్ పార్లమెంట్ ఎంపీ స్థానానికి బీఆర్‌ఎస్‌లో భారీ డిమాండ్ ఉంది. టికెట్ ఇస్తే పోటీ చేసేందుకు ఆరడజను మందికి పైగా సిద్ధంగా ఉన్నారు. 2016 నుంచి రెండు పర్యాయాలు గెలిచిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ మరోసారి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండటంతో రెండు పర్యాయాలు దయాకర్ సులభంగా ఎంపీగా గెలిచారని, ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌తో పాటు మోదీ హవాతో జోష్‌లో ఉన్న బీజేపీని తట్టుకో వటం అంతా సులవు కాదని గులాబీ నేతలు లెక్కలు వేస్తున్నారు. దీంతో మాజీ డిప్యూటి సీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె డాక్టర్ కడియం కావ్యను పార్లమెంట్ బరిలో దించాలనే ఆలోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం స్టేషన్‌ఘనపూర్ ఒక్కటే బీఆర్‌ఎస్ ఖాతాలో పడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం కావ్యను బరిలో దించాలని

మిగతా 4వ పేజీలో..

మళ్లీ కవితకే...

- బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ

మహబూబాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం.. సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే ఖరారైంది. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ ప్రకటన చేశారు. మానుకోట నుంచి ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవిత పోటీచేస్తున్నారని వెల్లడించారు. ఆమె విజయం కోసం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ, ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనాయకులు అంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు.



సంబంధిత నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సూచించిన కేసీఆర్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఇక ఈ సమావేశానికి మహబూబాబాద్ ఎంపీ నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం నుంచి గెలిచిన ఏకైక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ గైర్హాజరయ్యారు. నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాక మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, బానోత్ హరిప్రియనాయక్, రేగ కాంతారావుతో పాటు ములుగు నుంచి పోటీ చేసి ఓడిన జడ్పీ చైర్‌పర్సన్ బడె నాగజ్యోతి, మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ హాజరయ్యారు. తొలుత ఈ సమావేశానికి హాజరైన మానుకోట జిల్లాకు చెందిన మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ఎమ్మెల్యే హరీష్ రావుతో మాట్లాడి.. తనకు వ్యక్తిగత పనిఉందని చెప్పి సమావేశం నుంచి వెళ్లిపోయినట్టు తెలిసింది.


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసిన కవిత, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు


మాట్లాడుతున్న జోరిక రమేశ్

పోటీకి ఉద్యమకారుల సై..

తమకు ఈసారి అవకాశమివ్వాలని, వరంగల్ టికెట్ కేటాయించాలన్న డిమాండ్‌ను ఉద్యమకారులు తెరపైకి తెచ్చారు. పార్టీలో సభ్యత్వం కూడా లేని వ్యక్తులకు వరంగల్ ఎంపీ టికెట్ ఎలా ఇస్తారని తెలంగాణ ఉద్యమకారులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ ఇప్పటికే హరీష్‌రావు, వినోద్‌కుమార్‌తో పాటు బీఆర్‌ఎస్ కీలక నేతలను కలిసి తనకు టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణివరంగల్ రూరల్ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న కూడా వరంగల్ ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా సైతం ఎంపి టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను కేసీఆర్ గుర్తించాలని డిన్నా కోరుతున్నారు. తెలంగాణ ఉద్యమకారులు బొల్లికొండ వీరేందర్, బైరి నిరంజన్, చింతల యాదగిరితో పాటు మరికొంత మంది కీలక నేతలు కూడా వరంగల్ టికెట్ కోసం క్యూ కడుతున్నారు. ఉద్యమకారుల్లో ఎవరికి టికెట్ ఇచ్చిన ఓకే.. కానీ, పార్టీలో సభ్యత్వం కూడా లేని వారికి టికెట్ ఇస్తే ఊరుకునేది లేదని ప్రెస్‌మీట్ పెట్టి మరీ వారు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. అయితే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఉన్న వారిని గుర్తించేందుకు పార్టీ అంతర్గతంగా సర్వే నిర్వహిస్తోంది. దళితుల్లో మాల, మాదిగ కులాల్లో ఎవరికి టికెట్ ఇస్తే గెలుపు అవకాశాలు ఉంటాయో అనే లెక్కలను కూడా అధిష్ఠానం తీస్తున్నట్టు సమాచారం. దీంతో వరంగల్ ఎంపి టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ గులాబీ పార్టీలో నెలకొంది.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

అభివృద్ధికి ఆదాయాలను పెంచుకోవాలి

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్

డోర్నకల్, మార్చి4 : మునిసిపాలిటీ అభివృద్ధి కోసం అంతర్గత ఆదాయాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ సూచించారు. డోర్నకల్ మునిసిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం సోమవారం చైర్మన్ వాంకుడోతు వీరన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ మునిసిపాలిటీలో గతంలో వివి ధ పథకాల మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. పట్టణంలో పందులు, వీధికుక్కల నివారించాలన్నారు. కూరగాయాల మార్కెట్‌కు సరైన భవనం లేకపోవడంతో వ్యాపారులు నష్టపోతున్నారని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చికెన్, మటన్ వ్యాపారులు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయిద్దని సూచించారు. గతంలో పట్టణ ప్రగతి కింద మంజూరు అయినా పనులకు చేసిన బిల్లులను ఇంతవరకు చెల్లించలేదని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ పోటు జనార్దన్, తేజావత్ సంధ్యారాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నిధులు ఖర్చు అయినా బిల్లులు ఎందుకు చెల్లించలేదని కమిషనర్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాను ఇటీవలే వచ్చానని, తనకు దీనిపై అంత అవగాహన లేదని వివరణ ఇచ్చారు. సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని ఎమ్మెల్యే పాలకవర్గానికి సూచించారు. మునిసిపాలిటీలో ఔట్ సోర్సింగ్ కింద ఇష్టారాజ్యంగా ఎందుకు తీసుకుంటున్నారని, నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎలా భర్తీ చేస్తారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మౌనిక జైన్, పర్వీన్ సుల్తానా చైర్మన్, కమిషనర్‌లను ప్రశ్నించారు. గత కొద్ది సంవత్సరాలుగా పని చేస్తున్న వారినే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్నామని వారు బదులిచ్చారు. అనంతరం 2024-25 మునిసిపాలిటీ అంచనా బడ్జెట్ రూ.7.60 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో ఆస్తిపన్ను రూపేనా రూ.1.7 కోట్లు, షాపుల కిరాయిల ద్వారా రూ.25 లక్షలు, పట్టణ ప్రణాళిక నుంచి రూ.47 లక్షలు, రాబడి ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. అలాగే మిగతావి ప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలో వస్తుందని చైర్మన్ వాంకుడోతు వీరన్న, కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కె.కోటిలింగం, కౌన్సిలర్లు బసిక అశోక్, కొండేటి హేమచంద్రశేఖర్, జర్పుల వీరన్న, కొత్త రాధిక, కందుల అరుణ, శీలం భాగ్యలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు అజిత్‌మియా, మారబోయిన రాంభద్రం, పచ్చిపాల మల్లికాంబ పాల్గొన్నారు.

నాణ్యమైన మామిడితోనే లాభాలు

- నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్

తొర్రూరు రూరల్, మార్చి4 : రైతులు నాణ్యమైన మామిడి పంటను పండించి పంటను ఉత్పత్తి చేసినప్పుడే అధిక లాభాలు వస్తాయని నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, మండల ఉద్యానవన అధికారి రాకేష్ అన్నారు. సోమవారం మండలంలోని నాంచారిమడూరు గ్రామంలో మామిడికాయల సంరక్షణపై సిరి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఫ్రూట్ ప్రోటక్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మామిడి తోటలు పూత, కాత దశలో ఉన్నాయని కాయను సంరక్షించడానికి ఫ్రూట్‌ప్రొటక్షన్ బ్యాగులను కట్టడంతో కాయకు ఎలాంటి దెబ్బతగలకుండా నాణ్యతతో వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసు, కరుణాకర్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



విషాదం

విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

- మరో ఇద్దరికి గాయాలు, బాలుడి పరిస్థితి విషమం
- ఓవర్‌లోడ్‌తో మంటలు చెలరేగి, తెగి పడిన కరెంట్ వైరు
- పర్వతగిరి మండలం మోత్యాతండాలో దుర్గమ్మ పండుగకు ఏర్పాట్లు
- ఊహించని ఘటనతో గ్రామంలో హాహాకారాలు

పర్వతగిరి, మార్చి 4 : ఊరంతా పండుగ సందడి. చుట్టాలతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగులతో, మైకుల మోతల మధ్య అంతా ఉత్సాహం గా ఉన్న వేళ.. ఒక్కసారిగా అలజడి. ఒక్కసారిగా విద్యుత్ స్తంభంపై మంటలు.. ఆ వెంటనే తెగిపడిన వైరు.. అక్కడే ఉన్న ఐదుగురిపై పడింది. గ్రామమంతా అంధ కారం.. హాహాకారాలతో మారుమోగింది. తామంతా దుర్గమ్మ పండుగకు సిద్ధమైన వేళ.. ఈ ఊహించని ఘటన తో వారంతా ఖిన్నులయ్యారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరోఇద్దరు గాయపడ్డారు. ఈ విషాద సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మోత్యా తండాలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మోత్యా తండాలో మంగళవారం దుర్గమ్మ పండుగను నిర్వహించుకునేందుకు ఘనంగా ఏర్పాట్లు చేసుకున్నారు. బంధుమిత్రులను ఆహ్వానించుకున్నారు. ఈ క్రమంలో వాకిళ్లలో అధిక వెలుతురు కోసమని ఇంటిం టికి ఒక డూమ్ లైట్‌ను అమర్చుకున్నారు. అయితే 100కుపైగా ఇళ్లున్న ఈ తండాకు సింగిల్‌ఫేస్ కరెంట్ మాత్రమే సరఫరా అవు తుండటంతో.. ఎక్కువ విద్యుత్ వినియోగమయ్యే డూమ్‌లైట్లను పెట్టడంతో ఓవర్‌లోడ్ పడింది. దీంతో ఓ స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆ వైర్ తెగిపడింది. ఆ వైర్ పడిన ప్రాంతంలో నిలుచుని ఉన్న మోత్యాతండాకు చెందిన భూక్యా రవి(30), ఆరేళ్ల వయసున్న అతడి కుమారుడు జశ్వంత్, రాయపర్తి మండలంలోని జగన్నాథపల్లి కొత్త తండాకు చెందిన రవి బావ గుగులోత్ దేవేందర్(32), మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని జమస్తాన్‌పురం సుందర్‌నాయక్ తండా నుంచి టెంట్లు వేసేందుకు వచ్చిన బానోత్ సునీల్(20), మోత్యా తండాకు చెందిన భూక్యా ఈర్యాలపై పడింది. దీంతో దేవేందర్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన రవి, జశ్వంత్, సునీల్, ఈర్యాను ఆస్పత్రికి తరలిస్తుండ గా రవి, సునీల్ మార్గంమధ్యలో మృతిచెం దారు. జశ్వం త్ ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈర్యా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు.


ఆనందం ఆవిరి..

ఆనందంగా పండుగజరుపుకునే సమయంలో విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతిచెందడంతో తండావాసుల ఆనందం ఆవిరైంది. తండావాసులు, బంధుమిత్రులంతా శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాల వద్ద బంధువులు పడి రోదించడం కలచివేసింది. ఇక ఈ ఘటనతో తండావాసులు పండుగను వాయిదా వేసుకోగా.. బంధువులంతా తిరుగుపయనమయ్యారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తండాకు చేరుకుని బాధిత కుటుంబాల వారిని పరామర్శించారు.

విచారణ జరిపిస్తాం: చంద్రమౌళి, ఏడీఈ

తండాలో ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ వేర్లు తెగిపడ్డాయని మాకు సమాచారం వచ్చింది. మా శాఖ తరఫున పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. వైర్లు తెగిపడి ముగ్గురు మృతిచెందడం బాధాకరం. విచారణ జరిపిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.


దేవేందర్ (ఫైల్)


సునీల్ (ఫైల్)


భూక్యా రవి (ఫైల్)


మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు చేపట్టే ప్రచార వ్యయం నమోదు చేయడంలో అధికారులు అవగాహన పొందాలన్నారు. ప్రజలు అందజేసే ఫిర్యాదులు, అవసరమైన సమాచారం తెలిపేందుకు సలహాలు అందించేందుకు ఫిర్యాదుల సెల్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్స్ సర్వేలెన్స్ టీం, వీడియో సర్వెలెన్స్ టీంలకు శిక్షణ ఇవ్వడంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గంలోని సమాచార నివేదికలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి పంపించాలని చెప్పారు. ఇంతకు ముందు ఎన్నికల్లో పొరపాట్లు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలని , సబ్జెక్టుల వారీగా బృందాలను ఏర్పాటు చేయాలని , ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని , డూప్లికేట్ ఓటర్లను గుర్తించాలని, క్షేత్రస్థాయిఅధికారులతో సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎం.డేవిడ్, శ్రీజ, ఐటీడీఏ పీవోలు ప్రతీక్‌జైన్, చిత్రామిశ్రా, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, కృష్ణవేణి, దామోదర్, తహసీల్దార్లు పవన్, గణేష్, రంజిత్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించండి

గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 169 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన గ్రీవెన్స్ దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమాదేవి, జిల్లా అధికారులు హరిప్రసాద్, వరలక్ష్మి, బాలరాజు, ఎర్రయ్య పాల్గొన్నారు.

మునిసిపల్ వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- మానుకోట కార్యాలయంలో ప్రత్యేక సమావేశానికి 34 మంది హాజరు
- అవిశ్వాసానికి అనుకూలంగా 30 మంది ఓటింగ్
- తటస్థంగా సీపీఐ కౌన్సిలర్లు
- వివరాలు వెల్లడించిన ఆర్డీవో అలివేలు


అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేస్తున్న కౌన్సిలర్లు

మహబూబాబాద్ టౌన్, మార్చి 4 : మానుకోట మునిసిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి అలివేలు సోమవారం ప్రకటించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మునిసిపల్ వైస్‌చైర్మన్ ఫరీద్‌పై అవిశ్వాసం పెడుతూ ఫిబ్రవరి 12న బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎంకు చెందిన 29 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి మునిసిపాలిటీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 35 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుతో కలిపి మొత్తం 38 మంది ఉండగా.. వారిలో 2/3 వంతు అంటే 26మంది సభ్యులు హాజరు కావాల్సి ఉంది. అయితే బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీలకు చెందిన 33 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్సీ, ఎక్స్ అఫిషియో సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఈ ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. ఇందులో అవిశ్వాసానికి అనుకూలంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావుతో పాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం సభ్యులు 30 మంది వైస్ చైర్మన్ ఫరీద్ వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇక 11వ వార్డుసభ్యులు బాలునాయక్ సంతకం సరిపోలక పోవడంతో ఆయన్ను ఓటింగ్‌కు అనుమతించలేదు. ఇక సమావేశానికి హాజరైన సీపీఐ కౌన్సిలర్లు ఇద్దరు మాత్రం తటస్థంగా ఉన్నారు. మెజార్టీ సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయడంతో మునిసిపల్ వైస్ చైర్మన్ ఫరీద్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో అలివేలు ప్రకటించారు. సదరు నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో వెల్లడించారు. కాగా, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, కౌన్సిలర్ కర్పూరపు పద్మ సమావేశానికి హాజరు కాలేదు.

మునిసిపాలిటీ వద్ద పోలీస్ బందోబస్తు..

మానుకోట మునిసిపాలిటీ వద్ద వైస్‌చైర్మన్ ఫరీద్‌పై అవిశ్వాస ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. మునిసిపల్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచే మునిసిపల్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. కాగా, బారికేడ్లు ఏర్పాటు చేసి మునిసిపాలిటీలోకి కౌన్సిలర్లను మాత్రమే అనుమతించారు. 3 గంటలకు ప్రారంభమైన సమావేశం సుమారు గంటకు పైగా కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా సమావేశం ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

- మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, మార్చి 4 : పట్టణంలోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండాచూడాలని, వేసవి కాలం దృష్ట్యా మంచినీరు సక్రమంగా సరఫరా చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద మెయిన్‌రోడ్‌లో మంచినీటి పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను సోమవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. విద్యుత్‌ను మంచినీటి పైపులైన్లకు ఇబ్బంది లేకుండా చూసి వేయాలని సూచించారు. తాగునీటి పైపు లు పగులకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏతః సురేష్ పాల్గొన్నారు.

కారులో ఉద్యమ సెగ!

(3వ పేజీ తరువాయి)

శ్రీహరి భావించారు. అయితే అధిష్ఠానం శ్రీహరికే టికెట్ ఇవ్వ టంతో అప్పట్లో కావ్య రాజకీయ రంగ ప్రవేశానికి అవకాశం దక్కలేదు. దీంతో కడియం శ్రీహరి తన కుమార్తె రాజకీయ ప్రవేశానికి ఇదే మంచి అవకాశంగా భావిస్తున్నట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో వరంగల్ టికెట్ కావ్యకు కేటాయించాలని అధి ష్ఠానం వద్ద కడియం శ్రీహరి గట్టిగానే ఒత్తిడి తెస్తున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో గత ఎన్నికల్లో వర్ధన్న పేట ఎమ్మెల్యేగా ఓటమిపాలైన మాజీ ఎమ్మెల్యే అ రూరి రమేష్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి ఉత్సాహంగా ఉన్నప్పటికి అధిష్ఠానం నుంచి ఎలాంటి హామీ రాకపోవటంతో తన భవిష్యత్ నిర్ణయం తీసుకునే క్రమంలో ఆయన బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఒకటిరెండు రోజుల్లో బీజేపీలో చేరేందుకు ఆరూరి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. దీంతో తన వారసురాలి పోటీకి లైన్ క్లియర్ అయిందని కడియం భావిస్తుండగా.. ఈ క్రమంలోనే ఉద్యమ నేతల నుంచి టికెట్ డిమాండ్ మొదలవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందన్న చర్చ జరుగుతోంది.

చర్చనీయాంశమైన మానుకోట అభ్యర్థి ప్రకటన

మానుకోట స్థానాన్ని బీఆర్ఎస్ అధినాయకత్వం సిట్టింగ్‌కే ఖరారు చేసింది. దీంతో ఎంపీ మాలోతు కవిత మరోసారి బీఆర్ఎస్ తరఫున పార్లమెంట్ బరిలో నిలవనున్నారు. ఆమె బీజేపీలోకి వెళుతున్నారనే ప్రచారం జోరుగా సాగిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశంలో మానుకోట అభ్యర్థిగా కవిత పేరును ప్రకటించడం చర్చనీయాంశమైంది. పార్టీ మారుతోందని ప్రచారం జరిగిన కవితకే మళ్లీ టికెట్ ఇవ్వటం వెనుక గులాబీ బాస్ వ్యూహం ఏంటనే చర్చ జరుగుతుంది. కవిత స్థానంలో వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ కుమారుడుకి టికెట్ ఇస్తారనే ప్రచారం జరగ్గా.. అనుహ్యంగా కవితకే టికెట్ రావటంతో పార్టీవర్గాల్లోనూ చర్చకు దారితీసింది. అయితే తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ సీతారాం నాయక్ తనకే టికెట్ ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమంలో తన పాత్రను గుర్తించాలని అధిష్ఠానం వద్ద విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే సీతారాంనాయక్ విజ్ఞప్తులకు గుర్తింపు లేకపోగా, బీజేపీ నుంచి పోటీకి ఆఫర్లు వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సీతారాంనాయక్ ఏం నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

సీపీని కలిసిన రఘునాథ్‌పల్లి ఎస్ఐ

హనుమకొండ క్రైం, మార్చి 4 : ఇటీవల జరిగిన బదిలీలలో రఘునాథ్‌పల్లి ఎస్ఐగా పోస్టింగ్ పొందిన డి. నరేష్ సోమవారం విధుల్లో చేరారు. కాగా, నూతనంగా బాధ్యతలు చేపట్టిన నరేష్ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశాడు. సీపీని కలిసి పూల మొక్కను అందించారు.

అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు ఛైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

బీఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డాగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

5-6 నెలల తర్వాత..
ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.


తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింద"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంచనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీల చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.


సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

బయటపడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

ఓఆర్‌ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించక పోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.


వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలెరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎన్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

మానుకోట డీపీఆర్వోగా రాజేంద్రప్రసాద్



మహబూబాబాద్ టౌన్, మార్చి4 : మహబూబాబాద్ జిల్లా సమాచార ప్రజాసంబంధాల శాఖ (డీపీఆర్వో) అధికారిగా రాజేంద్ర ప్రసాద్ బదిలీపై వస్తున్నారు. ఇక్కడ డీపీఆర్వోగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న శ్రీనివాసరావు, అక్కడ డిప్యూ టేషన్‌లో పని చేస్తున్న రాజేంద్రప్రసాద్ డిప్యూటేషన్లను రద్దుచేస్తూ ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్ ఎం.హన్మంతరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు జనగామకు, మానుకోటకు రాజేంద్రప్రసాద్ యథావిధి స్థానాలకు వెళ్లాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, మానుకోట డీపీఆర్వోగా రాజేంద్రప్రసాద్ మంగళ వారం బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు మరిపెడకు మంత్రి పొంగులేటి రాక

మరిపెడ, మార్చి 4 : డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం మరిపెడకు రానున్నారని జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేఖరులతో మాట్లాడారు. రానున్న మానుకోట పార్లమెంట్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ విప్, డోర్నకల్ రాంచంద్రునాయక్ అధ్యక్షతన జరిగే కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి హాజరవుతున్నారన్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యవర్గం, యూత్ కాంగ్రెస్, అనుబంధసంఘాల బాధ్యులు, పార్టీ ముఖ్యకార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

డిగ్రీ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మరిపెడ, మార్చి 4 : ఎస్సీ, ఎస్టీ, బీసీ డిగ్రీ గురుకుల మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఏప్రిల్ 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మరిపెడ ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులతోపాటు ప్రస్తుతం సెంకడీయర్ చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిపెడ ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (బీజెడ్‌సీ), బీకాం కంప్యూటర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏప్రిల్ 24వ తేదీన ప్రవేశ పరీక్ష జరిపి మెరిట్ పొందిన విద్యార్థులకు డిగ్రీ గురుకుల ప్రవేశాలను కలిపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి రిమాండ్

దంతాలపల్లి, మార్చి 4 : ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై దంతాలపల్లిలోని ఓ బిర్యానీ సెంటర్ వద్ద స్థానిక పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రాత్రి సమయంలో గ్రామానికి చెందిన యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్నారని 100కు డయల్ వచ్చిందన్నారు. ఈ క్రమంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో ముగ్గురు వ్యక్తులు తిరగబడ్డారన్నారు. సదరు తిరుగబడ్డ వ్యక్తులు పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో గ్రామానికి చెందిన సుతారపు అర్జున్, నెల్లూరి యువరాజ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామన్నారు. కాగా, మరొకరు పరారీలో ఉన్నారన్నారు. త్వరలో పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

ఉగ్గంపల్లిలో ఇసుక డంపు సీజ్

చిన్నగూడూరు, మార్చి 4 : మండలంలోని ఉగ్గంపల్లిలోని కోటకుంట చెరువులో డంపు చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్‌చేశారు. ఆర్ఐ కొత్తపల్లి వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం. నమ్మదగిన సమాచారం మేరకు గ్రామంలోని కోటకుంట చెరువులో డంపుచేసిన 25 టిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. కాగా, గతంలో అదే గ్రామంలో సీజ్ చేసిన 20 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలంపాట వేశారు. 20 ట్రిప్పులకు రూ.37వేలు వేలం పాటపాడి గ్రామానికి చెందిన గుగులోతు యాకన్న దక్కించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కొమురెల్లి, రాంకోటి, మల్లేషం, వెంకట్య, గంగరాజు, మేగ్యా, రాజు, అధికారులు ఉన్నారు.

కురవి వీరభద్రస్వామి జాతర షెడ్యూల్ ఇదే..

- 8న స్వామివారి కల్యాణోత్సవం
- ఆలయంలో కొనసాగుతున్న ఏర్పాట్లు

కురవి, మార్చి4 : మహాశివరాత్రి సందర్భంగా కురవిలో జరిగే వీరభద్రస్వామి, భద్రకాళిమాత కల్యాణానికి ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. స్వామివారి కల్యాణానికి ఆలయ అధికారులు ఆహ్వానపత్రికలు, పోస్టర్‌లు, కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. కరపత్రాలను ఇంటింటికీ పంపుతూ, పోస్టర్‌లు బస్సులకు, గ్రామాల్లో అతికిస్తూ, అతిథులకు ఆహ్వానపత్రికలు పంపుతూ భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి కల్యాణానికి హాజరయ్యేలా అధికారులు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయ అధికారులు స్వామివారి కల్యాణ పత్రికలను వాట్సాప్ గ్రూపుల్లో సైతం పెట్టి, ప్రచారం నిర్వహిస్తున్నారు.

7న అంకురార్పణతో ప్రారంభం

కురవి శ్రీవీరభద్రస్వామి జాతర ఈనెల 7న గురువారం సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో ప్రారంభం కానుంది. 8న శుక్రవారం మహాశివరాత్రి పురస్కరించుకుని 11 గంటల వరకు పూర్ణాభిషేకం, రాత్రి 7గంటలకు గ్రామసేవ, ఎదురుకోలు, తెల్లవారుజామున (శనివారం) 12-30 గంటలకు శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. శనివారం నుంచి 9న శుక్రవారం వరకు ప్రతి నిత్యం అభిషేకలు, హోమం, గ్రామసేవ నిర్వహిస్తారు. 11న కురవి పెద్దచెరువు నందు స్వామివారి తెప్పోత్సవం, 13న సాయంత్రం 6గంటలకు రథోత్సవం, 14న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు బండ్లు తిరుగే కార్యక్రమం, పారువేట, దోపోత్సవం నిర్వహిస్తారు.

అలాగే ఈనెల 15వ తేదీన ఉదయం వసంతోత్సవం, సాయంత్రం ఏకాంతసేవ, నాగవెల్లి పూజాకార్యక్రమాలను నిర్వహిస్తారు. 16న సాయంత్రం స్వామివారి పవళింపు సేవ, 20వ తేదీ శ్రీపార్వతిసమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం, 22వ తేదీ పదహారు రోజుల పండుగ పూజాకార్యక్రమాన్ని జరుపనున్నారు.



'ప్రతిభను వెలికితీసేది ఉపాధ్యాయులే'

నెల్లికుదురు, మార్చి 4 : విద్యార్థుల ప్రతిభను వెలికితీసేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ తెలిపారు. నెల్లికుదురు మండలంలోని పార్వతమ్మగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం డిజిటల్ తరగతులను ప్రారంభించారు. పాఠశాలలో మహాత్మగాంధీ విగ్రహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగతుందన్నారు. పాఠశా అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, వైస్ఎంపీపీ జెల్ల వెంకటేష్, ఎంపీటీసీ పెరమాండ్ల గుట్టయ్య, ఎదళ్ల యాదవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నరేంద్రకుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన

కేసముద్రం, మార్చి 4 : కేసముద్రం విలేజి ఎన్టీఆర్‌నగర్‌లో సోమవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ ఆధ్వర్యంలో మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

మార్కెట్లో రైతుల మిర్చి బస్తాలు చోరీ

- పోలీసులకు ఫిర్యాదు



మిర్చి పోగొట్టుకున్న బాధితరైతులు రైతులు

కేసముద్రం, మార్చి 4 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇద్దరు రైతులకు చెందిన ఆరు బస్తాల మిర్చి మాయమైంది. బాధిత రైతులు పటేరు జలెందర్, తారక తిరుమలయ్య తెలిపిన ప్రకారం. గత నెల 28న మార్కెట్‌కు ఆరు బస్తాల్లో తేజ రకం, నాలుగు బస్తాల్లో తాలురకం మిర్చిని విక్రయించేందుకు తీసుకువచ్చారు. తాలు రకం విక్రయించగా తేజరకం మిర్చికి ఆశించిన ధర రాకపోవడంతో మిర్చిని యార్డులోనే వదిలేసి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం వచ్చేసరికి ఆరు మిర్చి బస్తాలు కనిపించలేదు. దీంతో రైతులు మార్కెట్ అధికారులకు, పోలీసులకు అదేరోజు ఫిర్యాదు చేశారు. మిర్చి బస్తాలు ఇతర వ్యాపారుల బస్తాల్లో పొరపాటు కలిసి ఎగుమతి చేసి ఉండొచ్చని, తాము పరిశీలిస్తామని రైతులకు మార్కెట్ అధికారులు చెప్పారు. నాలుగు రోజులవుతున్నప్పటికీ తమ మిర్చి బస్తాల జాడ లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యార్డు అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణ, సెక్యూరిటీగార్డులు ఉన్నారనే బరోసాతో తాము సరుకును షెడ్డులోనే ఉంచి ఇంటికి వెళ్లినట్లు చెప్పారు. ఆరుగాలం శ్రమించి పండించిన ఆరు బస్తాల్లోని సుమారు రూ.60 వేల విలువైన మిర్చి చోరీకి గురయ్యాయని వాపోయారు. తమ పంటను ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. అయితే రైతులు మిర్చి బస్తాలు వేసిన చోట సీసీ కెమెరా పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం.

కిష్టాపురంలో రెండు ఇళ్లలో చోరీ

కేసముద్రం, మార్చి 4 : కేసముద్రం స్టేషన్ కిష్టాపురంలో రెండు ఇళ్లలో చోరీ ప్రయత్నం జరగగా ఒకరి ఇంట్లో నాలుగు తులాల బంగారు అభరణాలు అపహరణకు గురైనట్లు ఎస్ఐ వంశీధర్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఎండి.మున్వర్ ఇంటికి తాళం వేసి మహబూబాబాద్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటికి తాళం పగులగొట్టి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు తులాల ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఇదే వీధిలో కూల్‌డ్రింక్ హోల్‌సేల్ డీలర్ ఎండి.హఫీజ్ ఇల్లు, గోదాంలో తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. అయితే ఈ ఇంట్లో బంగారం, డబ్బులాంటి విలువైనవి ఏవీ చోరీకి గురికాలేదని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ నుంచి క్లూస్ టీం సభ్యులు వచ్చి ఆధారాలు సేకరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో భూపతిపేటలో ఇల్లు దగ్ధం

గూడూరు, మార్చి 4 : మండలంలోని భూపతిపేటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భూపతిపేటకు చెందిన పత్రి వెంకటయ్య-పూలమ్మలు జాతీయ రహదారి పక్కన ఓ పూరిగుడిసెలో నివసిస్తున్నారు. వీరిద్దరు దినసరి కూలీలో భాగంగా కూలీ పనికి వెళ్లారు. ఇంట్లో ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్‌కు గురికావడంతో గుడిసెకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. తన కూమార్తెకు ఇటీవల వివాహం జరుగడంతో ఆమెకు ఇద్దామని ఇంట్లో ఉంచిన రూ.2 లక్షల నగదు, రెండు తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలతో పాటు 10 బస్తాల బియ్యం, కుమార్తె స్టడీ సర్టిఫికెట్స్ కూడ కాలిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ అవుల కవితఅశోక్, కార్యదర్శి ఆలీ ఘటన స్థలాన్ని సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



యాకయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, మార్చి 4 : చికిత్స పొందుతూ ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు గాంధీపురంలో సోమవారం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గాంధీపురం గ్రామానికి చెందిన రామిశెట్టి యాకయ్య (50) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న ఎకరం భూమిలో మిర్చిపంటను సాగు చేశాడు. వేసిన పంట దిగుబడి రాకపోవడంతో చేసిన రూ.లక్ష అప్పుఎలాతీర్చాలనే మనస్థాపంతో ఫిబ్రవరి 21న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స నందిస్తుండగా ఈనెల 3న రాత్రి 9 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1993-94 టెన్త్‌బ్యాచ్ విద్యార్థులు

గూడూరు, మార్చి 4 : గూడూరు బాలుర ఉన్నత పాఠశాలలో 1993-94 పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పోచయ్య, ఇబ్రహీం, మాణిక్యం శ్రీధర్‌ను సన్మానించారు. నాటి తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. నూకల రాజు, కాయితోజు భాస్కర్, మూల కృష్ణమూర్తి, బొద్దుల రమేష్, అజయ్, బద్యా, సారయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనపై శ్రద్ధ చూపాలి

- అంతర్జాతీయ పర్వతారోహకుడు యశ్వంత్

ఇనుగుర్తి, మార్చి 4 : విద్యార్థులు యుక్తవయస్సులోనే చదువుపట్ల శ్రద్ధ చూపాలని అంతర్జాతీయ పర్వతారోహకుడు యశ్వంత్ అన్నారు. ఇనుగుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పుస్తకాలు అందజేశారు. ఆపై పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు ఉన్నత చదువులపై ప్రేరణ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూజాతీయ స్థాయిలో ఎంతోకష్టపడి తన గమ్యాన్ని చేరుకున్నానని, ప్రతీ విద్యార్థి విద్యాజీవితంలో తాను ఎంచుకున్న లక్ష్యంపై దృష్టి సారించి ముందుకు సాగాలన్నారు. ఫౌండేషన్ జాతీయ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ రమేష్ మాట్లాడుతూపేద విద్యార్థుల సంక్షేమం కోసం తమ ఫౌండేషన్ ఎళ్లవేళల సహకారం అందిస్తామన్నారు. ఫౌండేషన్ సభ్యులు అంతర్జాతీయ క్రీడాకారుడు వాంకుడోతు తరుణ్‌ణాయక్, వినోద్, సుమన్, హెచ్ఎం రూపారాణి, ఉపాధ్యాయులు కొమ్ము రాజేందర్, దేవేందర్, యాదగిరి, శిరీష, యాకయ్య, సమ్మిరెడ్డి, కిషన్, కుమారస్వామి పాల్గొన్నారు.

మానుకోట లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులతో మానుకోట లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

మహబూబాబాద్ టౌన్, మార్చి4 : ఉత్తమ సేవలను అందించినందుకుగాను లయన్స్‌క్లబ్ మానుకోట శాఖకు పది అవార్డులు లభించాయి. ఉత్తమఅధ్యక్షుడు, ఉత్తమ కార్యదర్శి, ఉత్తమ కోశాధికారి, ఎన్వీరాన్‌మెంటల్, అగ్రికల్చర్, విజన్ సర్వీస్, డయాలసిస్ క్యాంపు, అత్యధికంగా నేత్రదానసేకరణ, పర్మినెంట్‌ప్రాజెక్టు, హెల్త్‌సర్వీసెస్ 10 విభాగాల్లో ఉత్తమ అవార్డులు లభించాయి. తొర్రూరులో ఆదివారం రాత్రి జరిగిన లయన్స్‌క్లబ్ రీజీయన్ మీట్‌లో రీజనల్ చైర్మన్ శారద చేతుల మీదుగా స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలోలయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, అశోక్, కోశాధికారి మాలె కాశీనాథ్, ఇంద్రసేనారెడ్డి, పీవీప్రసాద్, కొండపల్లి కేశవరావు, అనుమాల వెంకటేశ్వర్లు, పి.లక్ష్మీనారాయణ, రాంచంద్రారెడ్డి, ఏకాంబ్రం పాల్గొన్నారు.

సబ్‌సెంటర్లను పరిశీలించిన వైద్యబృందం

దంతాలపల్లి, మార్చి 4 : మండల కేంద్రంతో పాటు పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, దాట్ల తదితర గ్రామాల్లోని సబ్‌సెంటర్లను సోమవారం వైద్యబృందం సభ్యులు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యురాలు చైతన్య మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు సిబ్బందితో ఇంటింటా చుక్కలను వేశామన్నారు. తప్పిన వారి జాబితాను తయారుచేసి నేరుగా చుక్కలను ఇస్తామన్నారు. సీహెచ్‌వో బోడా బాలాజీనాయక్, సూపర్‌వైజర్లు అసిస్టెంట్లు శ్రీను, సత్తిబాబు, ఏఎన్‌ఎంలు కళావతి, సుభద్ర, సుమతి పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవ కేంద్రం ఏర్పాటు

తొర్రూరు, మార్చి 4 : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీవో సాలార్ సాహెబ్ సోమవారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చిన వారు తప్పుగా నమోదైతే రసీదు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకుని వచ్చి సరిచేసుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పని దినాల్లో సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మండలంలోని ఆయాగ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీవో గౌస్, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై సదస్సు

మరిపెడ రూరల్, మార్చి 4 : మహిళా హక్కు చట్టాలపై ప్రతీ మహిళ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. సోమవారం అబ్బాయిపాలెంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సదస్సును నిర్వహించారు. మహిళలపై దాడులు, దైర్జన్యాలు జరిగినప్పుడు షీ టీంలకు ఫిర్యాదు చేయాలన్నారు. టీచర్లు విజయకాంత, అలవాల సర్వస్వతి, లలిత, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

'గుడికి స్థలం కేటాయించండి'

చిన్నగూడూరు, మార్చి 4 : ఉగ్గంపల్లిలో గోర్ బంజారాల ఆరాధ్యదైవం సేవలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని లంబాడి తండాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డీఎస్ వెంకన్న సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రస్తుత డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌లో గల సర్వేనెం 108లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆలయ నిర్మాణానికి కేటాయింపునకు సహకరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆలయ నిర్మాణానికి స్థల కేటాయింపులో అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. డీఎస్.రాంచందర్ నాయక్, బానోత్ కొండయ్య ఉన్నారు.

విగ్రహావిష్కరణను సక్సెస్ చేయాలి

టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహబూబ్‌ఆలీ

గూడూరు, మార్చి 4 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఈనెల 8న జరుపతలపెట్టిన సావిత్రిబాయిపూలే విగ్రహావిష్కరణ, మహిళ సదస్సును జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహబూబ్‌ఆలీ, మండల అధ్యక్షుడు సోమ రవి పిలుపునిచ్చారు. గూడూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖ నోడల్ అధికారి చీర బిక్షపతి చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి తరానికి సావిత్రిభాయిపూలే ఆదర్శనీయమన్నారు. టీపీటీఎఫ్ నాయకులు ఆదినారాయణ, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, నిర్మల, లక్ష్మి, సులోచన, ప్రమీల, యాకలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 4 : పర్వతగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం లింగమూర్తి మాట్లాడుతూపట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఎంఈవోగా నిహారిక, హెచ్ఎంగా రిత్విక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఉపాధ్యాయులు సుమీల రాణి, బి.గీత, మమత, మెర్సీ, రాధిక పాల్గొన్నారు.

కొత్తగూడ మండలంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కొత్తగూడ, మార్చి 4 : మండలంలోని కొత్తగూడ, మోకాళ్లపల్లి, మొండ్రాయిగూడెం గ్రామాలలో సీసీ రోడ్డు పనులను పంచాయతీరాజ్ శాఖమంత్రి ధనసరి సీతక్క కోడలు కుసుమాంజలి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన మండలాల అభివృద్ధికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. ఈ మండలాల్లోని గ్రామాల్లో అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, జిల్లా నాయకుడు లావణ్య వెంకన్న, కొత్తగూడ టౌన్ అధ్యక్షుడు గుమ్మడి సమ్మయ్య, సర్పంచ్‌లు మల్లెల రణధీర్, బంగారి భారతికిషన్, ఎంపీటీసీ హలావత్ సాలూకీ సురేష్, మండల యూత్ అధ్యక్షుడు బోయినపల్లి ప్రశాంత్‌రెడ్డి, నాయకులు గట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- ఎమ్మెల్యే మురళీనాయక్



ఫాతిమాకు జీరో విద్యుత్ బిల్లును అందజేస్తున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, మార్చి 4 : అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు సమీపంలోని వినియోగదారులకు 200 లోపు ఉచిత విద్యుత్‌ను ఉపయోగించుకున్న వారికి సోమవారం గృహజ్యోతి పథకం జీరో బిల్లును కొట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 32,728 మంది లబ్ధిదారులను ఉచిత విద్యుత్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఇంకా 34,827 కుటుంబాలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని వారు కూడా ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. విద్యుత్‌శాఖ జిల్లా అధికారి నరేష్, ఏఏవో రమేష్, డీఈ విజయ్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు అంజయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, అంబటి మహేందర్‌రెడ్డి, ఖలీల్, చిట్టె వెంకటేశ్వర్లు, కోడి నాగలక్ష్మిశ్రీనివాస్, పోతరాజు, చుక్కల ఉదయ్‌చందర్, ఏతులు సంగీత, నవ్యశ్రీ పాల్గొన్నారు.

సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా..

కేసముద్రం : నియోజకవర్గ గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కోరుకొండపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో భూ కబ్జాలు, అక్రమాలు ఉండవన్నారు. అసెంబ్లీ మాదిరిగానే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, సొసైటీమాజీ ఛైర్మన్ బండారు వెంకన్న, సట్ల శ్రీనివాస్, బీరం గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న యశస్విని రెడ్డి

తొర్రూరు రూరల్, మార్చి4 : గ్రామాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో చేపట్టే ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులు ఆమె ప్రారంభించి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయడంతో పాటు గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజా పాలనలో దరఖాస్తు చేస్తున్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు నుంచు సంతోష్, గ్రామపార్టీ అధ్యక్షుడు తోట అశోక్, సీనియర్ నాయకులు సదాకర్, నారాయణ, రణధీర్ రెడ్డి, కిషన్‌రెడ్డి, పెదగాని సోయ్య, సురేష్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాల స్ఫూర్తిగా ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య

గార్ల, మార్చి 3 : నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు ప్రజల పక్షాన పోరుసాగించిన అమరుల త్యాల స్ఫూర్తిగా నేటి తరం కార్యకర్తలు ప్రజా ఉద్యమాలు నిర్మించాలని న్యూడెమొక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. గార్ల మండలం మద్దివంచ గ్రామంలో గౌని వీరయ్య 39వ వర్ధతి వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గౌని వీరయ్య స్మారక భవనం నుంచి కార్యకర్తలు గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అమ్మ నాన్నాల ప్రాంగణం వద్ద గౌని ఐలయ్య పార్టీ జెండాను ఎగర వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుసిని బాబురావు,గౌని భద్రయ్య, చిర్ర పాండురంగయ్య, ముండ్ల రంగయ్య, గౌని మల్లేశం, మహబోలేషా, లక్కం వెంకన్న, రాంబాబు, మహేష్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 4 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని గిరిజన సామాజిక చైతన్యవేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో సోమవారం గుగులోతు సూర్యప్రకాష్ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గతనెల 9, 10 తేదీల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, నగదు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మగాని కృష్ణమూర్తి, శంతన్‌రామరాజు, రీనా, కేలోతు సాయికుమార్, పట్ల మధు, గందసిరి జ్యోతిబాస్, సింహాద్రి, రాకేష్, వినయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.